సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



అలల చెంత.. తినరా మైమరచి
సాగరతీరంలో మురీ మిక్చర్, పీనట్ బఠానీ, టమాటా బజ్జీ వంటి విభిన్న రుచులకు సందర్శకులు ఫిదా అవుతున్నారు. 8లో



హర్షినికి 'విట్'లో సీటు
పేదింటి ఆణిముత్యం సాయిహర్షినికి ప్రసిద్ధి చెందిన విట్‌లో ఉచితంగా బీటెక్ చదువుకునే అవకాశం దక్కింది. 8లో



డీసీసీబీ భవన స్థల పరిశీలన
పాత నగరంలో డీసీసీబీ భవన నిర్మాణం కోసం చదును చేసిన స్థలాన్ని చైర్మన్ కోలా గురువులు పరిశీలించారు. 8లో

న్యూస్‌రీల్

13న ఏపీఎల్ 3కే రన్



విశాఖ స్పోర్ట్స్: ఏసీఏ ఆధ్వర్యంలో ఈనెల 12, 13వ తేదీల్లో 3కే రన్ నిర్వహించనున్నట్లు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి తెలిపారు. ఈనెల 16 నుంచి విశాఖ**లో ప్రారంభం** కానున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్**(ఏపీఎల్)** రెండో సీజన్ సందర్భంగా 12న **విజయవాడలోని** ఇందిరాగాంధీ స్టేడియం వద్ద, **13న విశాఖ** సాగర తీరంలో ఈ పరుగు ఏ**ర్పాటుచేసినట్లు** పేర్కొన్నారు. మన ఆంధ్ర-**మన ఏపీఎల్** పేరిట నిర్వహించనున్న ఈ పరుగును అన్ని జిల్లాల్లోనూ నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. విశాఖలో నిర్వహించనున్న పరుగులో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు, అంతర్జాతీయ క్రికెటర్లు కె.ఎస్.భరత్, హనుమవిహారి, షబ్నమ్ పాల్గొనున్నారన్నారు.

నగరానికి 800 క్రేట్ల టమాటాలు



సీతమ్మధార: నగరానికి 800 క్రేట్ల టమాటాలు వచ్చాయని, కిలో రూ.50 చొప్పున రైతుబజారుల్లో శుక్రవారం విక్రయించనున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం షేక్‌యాసిన్ తెలిపారు. సీతమ్మధారలో 120 క్రేట్లు, ఎంవీపీలో 120 క్రేట్లు, నర్సింహనగర్‌లో 50 క్రేట్లు, పెదవాల్తేరులో 35 క్రేట్లు, గోపాలపట్నంలో 100 క్రేట్లు, మర్రిపాలెంలో 50 క్రేట్లు, గాజువాకలో 30 క్రేట్లు, పెదగంట్యాడలో 25 క్రేట్లు, స్టీల్‌ప్లాంట్‌లో 30 క్రేట్లు, కంచరపాలెంలో 100 క్రేట్లు, పెందుర్తిలో 60 క్రేట్లు, మధురవాడలో 60 క్రేట్లు, ములగాడలో 20 క్రేట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆధార్, రేషన్ కార్డు చూపిస్తే మనిషికి కిలో చొప్పున విక్రయస్తారన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి శ్రీకారం చుట్టారు. పెదవాల్తేర్‌లోని కేడీపీఎం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరరావు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ రోజు అందుబాటులో లేని విద్యార్థులకు ఈనెల 17న మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ బాలల హక్కుల కమిషన్ గౌరవ సభ్యులు గొండు సీతారాం, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సమత, నోడల్ అధికారి డాక్టర్ రమారెడ్డి, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం సుమతి బాయ్, చినవాల్తేర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమ్య, డాక్టర్ హినా, శాంతి పాల్గొన్నారు.

ముగిసిన అప్రెంటీస్ శిక్షణ



మెడల్స్ అందుకుంటున్న సెయిలర్లు

సింధియా: ఐఎన్ఎస్ విశ్వకర్మలో కోస్ట్‌గార్డు, హల్ ఆర్టిఫైసర్ అప్రెంటీస్ శిక్షణ విజయవంతంగా ముగిసింది. సెయిలర్ ట్రైనీలుగా 41 మంది, కోస్ట్‌గార్డు శిక్షణ ఐదుగురు పొందారు. గురువారం వీరికి కోర్సు కంప్లీషన్ పరేడ్‌ను ఎస్ఎమ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ రియర్ అడ్మిరల్ ఆర్.ఎస్.ధాలివాల్ సమీక్షించారు. నౌకాదళ ప్లాట్‌ఫాంలలో అమర్చిన వివిధ హల్ పరికరాల నిర్వహణ అప్రెంటీస్ శిక్షణను పూర్తి చేయడంతోపాటు, అగ్నివీర్ హైజనిస్ట్ విధుల్లో అవగాహన కల్పించారు. ఈ జట్టులో దీపక్‌కుమార్ మెరిట్‌లో నిలిచి, గోల్డ్ మెడల్ సాధించాడు. అభిజిత్, టి.వనిత పురుషులు, మహిళల విభాగాల్లో ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ పొందినట్టు అధికారులు పేర్కొన్నారు.

నేడు ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

తాటిచెట్లపాలెం: ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ బాల, బాలికల ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక శుక్రవారం మారికవలసలో గల ఇంటెల్ స్కూల్‌లో జరుగుతుందని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.త్రినాథ్ తెలిపారు. ఈనెల 12, 13 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో గల ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 9వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ బాలురు, బాలికలు ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు. జిల్లా జూనియర్ టీమ్ సెలక్షన్స్‌లో పాల్గొనేవారు 2005 నుంచి 2010 మధ్య జన్మించి ఉండాలన్నారు. అలాగే ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

అలలపై అద్భుతం



ఓషన్ డెక్ నమూనా

- సాగరతీర అందాల వీక్షణకు సరికొత్త వ్యూపాయింట్
- ముంబయి తరహాలో విశాఖలో 'ఓషన్ డెక్'
- ప్రణాళికలు సిద్ధం చేసిన వీఎంఆర్‌డీఏ
- పాత లైట్‌హౌస్ వద్ద రూ.7.8 కోట్లతో జీ+1 నిర్మాణాలు
- నేటి నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభం

దొండపర్తి: సముద్ర అలలపై అద్భుతం ఆవిష్కృతం కానుంది. సాగర తీరం నుంచి సరికొత్త ఉషోదయం పలకరించనుంది. విశాఖ పర్యాటక సిగలో మరో కలికితురాయి చేరనుంది. ముంబయి తరహాలో విశాఖ బీచ్‌లో పాత లైట్‌హౌస్ ప్రాంతంలో 'ఓషన్ డెక్' ప్రాజెక్ట్‌కు విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) రూపకల్పన చేసింది. దేశంలోనే రెండో ఓషన్ డెక్‌గా విశాఖలో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి శుక్రవారం నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

పర్యాటకులను ఆకర్షించే విధంగా..

నగరంలో 27 కిలోమీటర్ల మేరకు తీర ప్రాంతం ఉంది. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి బీచ్ వరకు అనేక పర్యటక కేంద్రాలు ఇప్పటికే దేశీయ, విదేశీ పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. తాజాగా మరో పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు వీఎంఆర్‌డీఏ సిద్ధమైంది. ముంబయిలో తరహాలో బీచ్ రోడ్డులో వీఎంఆర్‌డీఏ పార్క్ వద్ద ఉన్న పాత లైట్ హౌస్ ప్రాంతంలో ఓషన్ డెక్ ప్రాజెక్ట్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సాగర తీర అందాలను వీక్షించేందుకే కాకుండా, సేద తీరుతూ విభిన్నమైన ఫుడ్స్‌ను ఎంజాయ్ చేసేందుకు వ్యూపాయింట్‌తో పాటు రెస్టారెంట్ల ఏర్పాటుకు వీలుగా ప్రాజెక్టును డిజైన్ చేసింది.

రూ.7.8 కోట్లతో ప్రాజెక్టు

ఈ ఓషన్ డెక్ ప్రాజెక్టు రూపకల్పన బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఏఎంఎల్)కి అప్పగించింది. ఈ సంస్థ ఇప్పటికే మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్ట్‌లో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(పీఎంఎస్)గా వ్యవహరిస్తోంది. ఈ ఓషన్ డెక్ ప్రాజెక్టును రూ.7.8 కోట్ల అంచనా వ్యయంతో ఏపీయూఐఏఎంఎల్ సంస్థ డిజైన్ చేసింది.

టెండర్ల ప్రక్రియ షురూ

ఓషన్ డెక్ ప్రాజెక్టుకు వీఎంఆర్‌డీఏ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రాజెక్టును త్వరిత గతిన చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా టెండర్ల ప్రక్రియను శుక్రవారం నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆరు నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఓషన్ డెక్ ప్రాజెక్ట్ ప్రత్యేకతలు

- వీఎంఆర్‌డీఏ పార్క్‌కు ఆగ్నేయంలో సముద్రం ఒడ్డు నుంచి సముద్రం లోపలకు 91 మీటర్ల పొడవుతో ఈ డెక్ ఉంటుంది.
- 45 మీ. సముద్రం ఒడ్డున భూమిపై, మరో 46 మీ. సముద్రం మీద డెక్ నిర్మాణం జరగనుంది.
- జీ+1 తరహాలో రెండు లెవెల్స్‌లో నిర్మాణం ఉంటుంది.
- ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో నడక దారి గ్లాస్‌తో ఉంటుంది. దాని మీద నడుస్తూ కింద సముద్రాన్ని స్పష్టంగా చేసే అవకాశం కలుగుతుంది.
- వ్యూ పాయింట్ ఉండే డెక్ అక్కడ ఉన్న రాతి ఉపరితలంపై ఏర్పాటు చేస్తున్నారు.
- గ్రౌండ్ ఫ్లోర్‌లో రెస్టారెంట్ వీలుగా ఆరు అడుగుల వెడల్పుతో గ్లాస్ ఛాంబర్ ఉంటుంది. సముద్రంలో ఎగసి పడే అలలను వీక్షిస్తూ రుచికరమైన ఆహారాన్ని ఆస్వాదించవచ్చు.
- అలాగే డెక్‌పై కూడా ఓపెన్ ఎయిర్ రెస్టారెంట్ సౌకర్యం ఉంటుంది.

ముంబయి తర్వాత విశాఖలోనే..



ఓషన్ డెక్ ప్రాజెక్టు విశాఖలో పర్యాటకులకు మంచి అనుభూతినిస్తుంది. దేశంలో ముంబయిలో మాత్రమే ఉంది. తరువాత విశాఖలోనే మరింత ఆకట్టుకొనేలా ప్రాజెక్టుకు డిజైన్ చేయడం జరిగింది. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– పి.శివప్రసాద్‌రాజు, చీఫ్ ఇంజినీర్, వీఎంఆర్‌డీఏ

'స్టీల్‌ప్లాంట్' ఊసెత్తి.. ఆపై వెనక్కి తగ్గి..

- విశాఖలో ఇల్లు తీసుకుంటానని ప్రకటన
- ఆ వెంటనే మంగళగిరి నుంచి వస్తానని సవరణ
- విశాఖ వాసులు ఓడించినందుకు కృతజ్ఞతలు
- పవన్ ప్రసంగంలో అస్పష్టత



స్క్రిప్ట్ చూసుకుంటున్న పవన్ కల్యాణ్

సాక్షి, విశాఖపట్నం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన ప్రసంగం ఆద్యంతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరగడానికే కేటాయించారు. విశాఖలో భూ కబ్జాలు పెరిగిపోయాయని, గంజాయికి అడ్డాగా మారిపోయిందని, ఆంధ్ర విశ్వవిద్యాలయం ర్యాంకు 2019లో 26 ఉండేదని, ఇప్పుడది 76కి పడిపోయిందని ఆరోపించారు. వీసీ తీరుపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తానని ప్రకటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ ఊపు మీదున్న తరుణంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి పవన్ ప్రస్తావించారు. 'స్టీల్‌ప్లాంట్' అంటూ ఏక వాక్యానికే పరిమితమై.. వెంటనే తెలంగాణ నుంచి రాష్ట్రం విడిపోవడానికి సీఎం జగనే కారణమని ఆక్రోశించారు. దీంతో అంతా విస్తుపోయారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రాన్ని నిలదీయాల్సిన బాధ్యతను విస్మరించి మాట మార్చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఉక్కు ప్రైవేటీకరణపై పోరాటం చేయాల్సిన ఆయన తన వద్ద సరైన సమాధానం లేకే ఆయన ఆ అంశాన్ని వదిలిపెట్టేశారని చర్చించుకున్నారు. విశాఖలో ఓటమిపై ఆయన ఆశ్చర్యకర వ్యాఖ్యలు చేశారు. 2014లో వైఎస్సార్‌సీపీని ఓడించమని తాను విశాఖ వాసులకు పిలుపునిస్తే 2019లో తననే ఓడించారని, అందుకు విశాఖ వాసులకు రుణపడి ఉంటానని చెప్పుకున్నారు. తాను ఓడిపోయినందు వల్ల రాజకీయంగా మరింత బలోపేతం అయ్యానన్నారు. విశాఖలో ఇల్లు తీసుకుని ఉంటానని చెప్పిన కాసేపటికే ఇక్కడి వారికి ఏ అవసరం ఉన్నా మంగళగిరి నుంచి వచ్చివాలతానని ప్రకటించారు. ఇలా భిన్న వ్యాఖ్యలతో పవన్ తన అస్పష్టతను చాటుకున్నారు. పవన్ కల్యాణ్ తాను ఏ అంశాలను ప్రస్తావించాలో కాగితాలపై రాసుకుని వచ్చారు. ఒక్కో పేపరు తీస్తూ వాటిలో అంశాలను ఆగి ఆగి చదివారు. మరోవైపు పవన్ సభ సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం కావలసి ఉండగా రాత్రి ఏడు గంటల వరకు ఆయన వారాహి వాహనం వద్దకు రాలేదు. దీంతో పవన్‌ను చూడడానికి వచ్చిన అభిమానులు ఇబ్బందులు పడ్డారు.

స్పృహ తప్పిన అభిమాని..



పవన్ సభకు వచ్చిన ఓ అభిమాని స్పృహ తప్పి పడిపోయాడు. తెన్నేటి విశ్వనాథం విగ్రహం వద్ద గ్రిల్స్‌కు ఆనుకుని జనం మధ్యలో ఉన్న ఆయన్ని తొక్కేశారు. దీంతో ఆయన స్పృహ కోల్పోయాడు. ఆయనకు పోలీసులు, అభిమానులు సపర్యలు చేసినా స్పందించలేదు. అనంతరం మోసుకుని వెళ్లి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఎయిర్‌పోర్టులో స్వాగతం

గోపాలపట్నం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం మధ్యాహ్నం 12.05 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్నారు. ఆయనకు జనసేన నాయకులు, అభిమానులు కార్యకర్తలు స్వాగతం పలికారు. మహిళా కార్యకర్తలు హారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం కాన్వాయ్‌లో షీలానగర్ మీదుగా నగరంలోకి బయలుదేరారు. విశాఖ విమానాశ్రయం వద్ద పోలీసులు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.

నైపుణ్య విద్యార్థులు వెలకట్టలేని సంపద

- ఐఐఎం సంచాలకుడు ఎం.చంద్రశేఖర్
- ఏయూ సిబ్‌లో బీబీఏ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



ఐఐఎం సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్ నుంచి సర్టిఫికెట్లు స్వీకరిస్తున్న విద్యార్థిని

ఏయూక్యాంపస్ : విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వెలకట్టలేని సంపదగా నిలుస్తారని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్ అన్నారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఏయూ సిబ్) ప్రాంగణంలో బీబీఏ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పుస్తక జ్ఞానాన్ని పొందడం కష్టతరమైన విషయం కాదని, సామాజిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఉత్సుకత విజయానికి తొలి మెట్టుగా నిలుస్తుందన్నారు. సృజనాత్మకంగా పనిచేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇక్కడ నేర్చుకున్న జ్ఞానం, పొందిన అనుభవాలను నిత్య జీవితంలో వినియోగించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా అత్యుత్తమ సామర్థ్యాలు కలిగిన నాయకులుగా ఏయూ సిబ్ విద్యార్థులు ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏయూ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలని సూచించారు. అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ బ్యాంకింగ్-ఇన్సూరెన్స్, ట్రావెల్-టూరిజం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలలో బీబీఏ, ఎంబీఏ చేయడానికి విదేశీయులు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ప్రత్యేక అతిథి విర్య ఎనర్జీ ఎం.డి అరుణ్ కిరణ్ కార్తిక్ సుంకర మాట్లాడుతూ ఉపాధి అవకాశం కోసం ఎదురుచూడకుండా మన చుట్టూ ఉన్న అనేక సమస్యలకు పరిష్కారాలు అందించే దిశగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏయూ సిబ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సారబంది తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేశారు.

సమన్వయంతో సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ రావత్ ప్రసాద్

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమన్వయంగా పరిష్కరించాలని జిల్లా సంక్షేమ విభాగాల అధికారులు నిర్ణయించారు. జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రావత్ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా సాంఘిక, బీసీ సంక్షేమం, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్లు, ఫిషరీస్ డిపార్టుమెంట్ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌లో గురువారం ఈ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ దీవెనతో పాటు చేయూత, ఆసరా, చేదోడు, మత్స్యకార భరోసా, వివిధ రకాల సబ్సిడీలు, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాల లబ్ధిదారులు నిధులు పొందడంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రధానంగా ఈకేవైసీ నమోదులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఈడీ రావత్ ప్రసాద్ మాట్లాతూ రానున్న రోజుల్లో లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి ఈ భేటీ ఉపయోగడపుతుందన్నారు. సాంఘిక సంక్షేమశాఖ డీడీ, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ రామారావు మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనకు సంబంధించి 184 మంది విద్యార్థులు ఈకేవైసీ, బ్యాంకు సమస్యల కారణంగా నిధులు పొందలేకపోయినట్లు తెలిపారు. శాఖల మధ్య సమన్వయం భవిష్యత్‌లో మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డీడీ కె.శ్రీదేవి, మైనార్టీ శాఖ ఈడీ సయ్యద్ సిరిజుల్లా, ఫిషరీష్ ఏడీ ఎం.వినయ్‌కృష్ణ పాల్గొన్నారు.

నెలాఖరులోగా రీ సర్వే పూర్తి చేయాలి

మహారాణిపేట: ప్రభుత్వ నిర్దేశిత సమయంలోగా రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ) సిద్ధార్థ్ జైన్ జిల్లా అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రీ-సర్వే ప్రక్రియపై గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల చివరి నాటికి రీసర్వే పనులు పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం రీసర్వే పూర్తి చేయడానికి తగిన చర్యలు చేపట్టామన్నారు. ఫైనల్ ఆర్‌వోఆర్ పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్, ఈ-కేవైసీని సకాలంలో పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ భూములు, రోడ్లు గుర్తించి హద్దులు నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఆర్డీవోలు భాస్కరరెడ్డి, హుస్సేన్ సాహెబ్, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సూర్యప్రకాష్‌పై దాడి కేసులో ముగ్గురు యువకులను పోర్టుటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఈ నెల 7వ తేదీన శాంతిపురం లాల్ బహదూర్‌శాస్త్రి పార్కులో ముగ్గురు యువకులు సిగరెట్లు తాగుతూ పెద్దగా కేకలు వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంతలో పార్కు ఎదురుగా ఉంటున్న ద్వారకా హెడ్ కానిస్టేబుల్ సూర్యప్రకాష్ నైట్ డ్యూటీకి వెళ్తేందుకు రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఇక్కడ అల్లరు వద్దని రామకృష్ణనగర్‌కు చెందిన నరాల సురేష్, గొలగాని అప్పలరాజు, సీతంపేటకు చెందిన పిలక దుర్గాప్రసాద్‌ను వారించారు. అంతే వారు ప్రకాష్‌పై పిడి గుద్దులుగుద్ది తీవ్రంగా గాయపరిచారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ వెంకటరావు పరిశీలించారు. కేసు నమోదు చేశారు. హెచ్‌సీని అక్కడ నుంచి ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. పోర్టుటౌన్ పోలీసులు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. గురువారం రిమాండ్‌కు తరలించారు.

నిర్దేశిత సమయానికి ఓటరు సర్వే పూర్తి చేస్తాం

కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, ఆర్డీవోలు

మహారాణిపేట: జిల్లాలో ఓటరు జాబితా పరిశీలన, ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమం నిబంధనల మేరకు జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఇంటింటా ఓటరు సర్వేపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా ఓటరు సర్వేలో బీఎల్‌ఓలకు సహకరిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెండు సమావేశాలు నిర్వహించామన్నారు. ఒకే డోర్ నెంబరులో పది కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వివరాలు, నూరు సంవత్సరాలు దాటిన వారి వివరాలు పరిశీలిస్తున్నామన్నారు. రిటర్నింగ్ అధికారులు, మండల అధికారులు బూత్ లెవల్ అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. క్రాస్ వెరిఫికేషన్ చేయడానికి ప్రత్యేక అధికారులను నియమిస్తారన్నారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఈఆర్ఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): రైల్వేలో సురక్షిత ప్రయాణం, ప్రమాదాల నివారణలో ప్రసార మాధ్యమాల పాత్ర కీలకమని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) సౌరభ్ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు భద్రతా విషయాలలో అవగాహన కల్పిస్తూ, సురక్షిత ప్రయాణం సాగించేలా వాల్తేర్ డివిజన్ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకు డివిజన్ పరిధిలో డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ సహకారంతో ప్రత్యేక డ్రైవ్‌లను, అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ మోనిష్ బ్రహ్మ నేతృత్వంలో సివిల్ డిఫెన్స్ సిబ్బందితో కూడా భద్రతా విభాగం కృషి చేస్తోందన్నారు. అనవసరంగా చెయిన్ లాగడం, ఫుట్‌బోర్డు ప్రయాణాలు, రైల్వే ట్రాక్‌లను దాటడం, రైల్వే ట్రాక్‌లపై బహిరంగ మలవిసర్జన వంటివి చేయరాదని, ఇవి నేరాల కిందకు వస్తాయని వీధి ప్రదర్శనలు, నాటికల ద్వారా ప్రజలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్లు, బహిరంగ ప్రదేశాలు, స్కూళ్లు, కాలేజీలు, లెవల్ క్రాసింగ్ గేట్లు, ట్రాక్‌ల పరిసర ప్రాంత ప్రజలకు స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్, మీడియా, సోషల్ మీడియా సహకారంతో అవగాహన కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేటి నుంచి లలితాపీఠంలో అష్టలక్ష్మి మహా యాగం



అష్టలక్ష్మి రూపాలతో సిద్ధం చేసిన కల్యాణ వేదిక

సీతంపేట: శ్రీ లలితాపీఠంలో శుక్రవారం నుంచి జరగనున్న అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మి మహాయాగానికి భారీగా ఏర్పాట్లు చేశారు. అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో యాగ నిర్వహణకు అన్నీ సిద్ధం చేశారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు మహా సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, అగ్నిమథనం, కలశస్థాపనతో యాగం ప్రారంభమవుతుంది. 12 నుంచి 15వ తేదీ వరకు ఉదయం అష్టలక్ష్మీ యాగం, స్వర్ణపుష్పార్చన, సాయంత్రం అష్టలక్ష్మీ అమ్మవార్ల విశేష అర్చన దర్బారు సేవ జరుగుతుంది. 16వ తేదీ సాయంత్రం దేశంలోనే ప్రప్రథమంగా అష్టలక్ష్మీ సమేత నారాయణ కల్యాణం జరగనుంది. ఈ విశేష పూజా కార్యక్రమాల కోసం లలితాపీఠం దర్బారు హాలులో కల్యాణ వేదికను చూడముచ్చటగా సిద్ధం చేశారు. వేదికపై ఎనిమిది రూపాల్లో అష్టలక్ష్మీలను స్థాపించారు. అష్టలక్ష్మీ యాగానికి ఎనిమిది యాగకుండాలు ఏర్పాటు చేశారు. ఈ రోజుల్లో అష్టలక్ష్మీ యాగంతో పాటు అష్టలక్ష్మీ వైభవం కూడా జరుగుతుంది.

మహిళా కళాశాల విద్యార్థిని కావడం గర్వకారణం

- మేయర్ గొలగాని హరి వెంకటకుమారి
- ఘనంగా విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవం



ఆర్జేడీ శోభారాణిని సత్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ సమత తదితరులు

అల్లిపురం: రెండు తెలుగు రాష్ట్రాల్లో నాక్ ఏ గ్రేడ్ సాధించిన మొదటి మహిళా కళాశాల అయిన విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థిని కావడం గర్వకారణంగా ఉందని గ్రేటర్ విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. డాబాగార్డెన్స్‌లోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న మేయర్ తొలుత కళాశాలలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. గౌరవ అతిథిగా హాజరైన ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ కె.సమత మాట్లాడుతూ విద్యార్థినులకు చదువుతో పాటు వ్యక్తిత్వం, సృజనాత్మకత ఎంతో అవసరమన్నారు. అకడమిక్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు, కళాశాల ప్రిన్సిపాల్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణితో కలసి మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల ర్యాంప్ వాక్ పోటీలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



సెల్ఫీ విత్ మేయర్

తాను డిగ్రీ చదివిన కాలేజీలోకి అడుగు పెట్టే సరికి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి విద్యార్థినిగా మారిపోయారు. జైలురోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె కళాశాలలో చాలాసేపు ఉత్సాహంగా గడిపారు. విద్యార్థినులతో కలసి సెల్ఫీ తీసుకున్నారు. విద్యార్థులు కూడా మచ్చటపడి మరీ ఆమెతో సెల్ఫీలు దిగారు.

ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పునఃప్రారంభం



ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ సతీష్

డాబాగార్డెన్స్: బీచ్‌రోడ్డులోని జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను గురువారం డిప్యూటీ మేయర్ కె.సతీష్‌తో కలిసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ కరోనా కారణంగా రెండేళ్లు మూతపడిందన్నారు. ఈతగాళ్లతో పాటు శిక్షణార్థులను దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టామన్నారు. యంత్రాలు, నీటి సరఫరా, ఎలివేషన్, టైల్స్, మరుగుదొడ్లు, విద్యుత్ ఆకర్షణీయమైన ముఖద్వారం ఏర్పాటుకు సుమారుగా రూ.2.4 కోట్లు ఖర్చు చేశామన్నారు. 5 నుంచి 12 ఏళ్లలోపు పిల్లలకు ఉపయోగపడేలా బేబీ పూల్‌ను కూడా సిద్ధం చేశామన్నారు. కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, బిపిన్‌కుమార్ జైన్, కోడూరు అప్పలరత్నం, ఆళ్ల లీలావతి, నెక్కల లక్ష్మి, చీఫ్ ఇంజినీర్ రవికృష్ణంరాజు, ఎస్ఈలు వేణుగోపాల్, కృష్ణారావు, గోవిందరావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సందర్శకులకు సొంత ప్రదేశంలో ఉన్న అనుభూతి, ప్రశాంతత, వినోదం అందించగలిగే పర్యాటక ప్రదేశాల్లో విశాఖపట్నం టాప్‌లో ఉంటుంది. ఇక్కడి అందమైన బీచ్‌లు, పార్కులు, పచ్చదనం పరచుకున్న కొండలను ఇష్టపడనివారు ఉండరు. పర్యాటక ప్రదేశాలు మాత్రమే కాదు ఇక్కడ బీచ్‌రోడ్డులో లభించే విభిన్న రుచులకు ప్రత్యేకంగా ఫ్యాన్స్ ఉన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో లభించే మురీ మిక్చర్, స్వీట్ కార్న్, మసాలా బఠానీ, టమాటా బజ్జీ మొదలైనవి రుచి చూడకుండా వెళ్లరంటే నమ్మండి. సందర్శకులకు ఎన్నో రుచికరమైన వంటకాలు అందిస్తూ.. తద్వారా ఉపాధి పొందుతున్నారు చిరు వ్యాపారులు. - విశాఖపట్నం డెస్క్

అలల చెంత తినరా మైమరచి





స్పైసీ.. టేస్టీ ఫుడ్ @ బీచ్‌రోడ్డు



మురీ మిక్చర్
ఈ పేరు వింటే చాలు విశాఖ బీచ్ గుర్తొస్తుంది. సుందర సాగర తీరంలో అలా బీచ్‌లో నడుచుకుంటూ ఈ మురీ మిక్చర్ తింటే ఆ కిక్కే వేరు. విశాఖ సాగర తీరానికి కారులో వచ్చినా, కాలి నడకన వచ్చినా .. మురీ మిక్చర్ రుచి చూడకుండా వెళ్లరు. మరమరాలు, పల్లీలు, ఉల్లి, పచ్చి మిర్చి, టమాటా వంటి పదార్థాలను కలిపి దీనిని తయారు చేస్తారు. దీనిపై చివర్లో కాస్త నిమ్మరసాన్ని వేస్తారు. బీచ్‌ను సందర్శకులను ఆకర్షించే బెస్ట్ స్నాక్ ఇది.

స్వీట్ కార్న్
సాగరతీరం పొడవునా స్వీట్ కార్న్ స్టాళ్లు కనిపిస్తాయి. స్వీట్ కార్న్ రుచి చూస్తూ సముద్ర తీర అందాలను ఆస్వాదించడం చాలా స్పెషల్‌గా ఉంటుంది. స్వీట్ కార్న్‌తో పాటు బొగ్గులపై వేడి చేసే మొక్క జొన్నలను కూడా ఇక్కడ టేస్ట్ చేయవచ్చు.



మసాలా బఠానీ
బీచ్‌రోడ్డులో తక్కువ ధరకు లభించే రుచికరమైన పదార్థాల్లో మసాలా బఠానీ ఒకటి. ఉడికించిన పల్లీలు, ఉల్లిపాయలు, టమాటా, నిమ్మరసంతో దీనిని మిశ్రమంగా తయారు చేస్తారు. పేపర్ కోన్ ఆకారంలో చుట్టి ఈ మిశ్రమాన్ని అందులో వేసి అందిస్తారు. ఈ మసాలా బఠానీలను ఎక్కువగా వృద్ధులు విక్రయిస్తున్నారు. వాళ్ల ముఖంలో ఆనందం చూసేందుకు అయినా దీన్ని రుచిని ఓ సారి చూడాల్సిందే..

టమాటా బజ్జీ
వైజాగ్ బీచ్‌ల్లో లభించే మరో రుచికరమైన తినుబండారం టమాటా బజ్జీ. టమాటాలను శనగపిండి మిశ్రమంలో కలిపి నూనెలో వేయిస్తారు. ఆ బజ్జీను రెండు ముక్కలుగా చేసి మధ్యలో ఉన్న టమాటా గుజ్జును తీసి బజ్జీలను కప్‌ల మాదిరిగా పక్కన పెడతారు. టమాటాతో పాటు పల్లీలు ఇతర పదార్థాలను జోడించి మెత్తని మిశ్రమంగా తయారు చేస్తారు. దీనిని కప్‌లలో వేసి రుచికరంగా అందిస్తారు.

మురీ మిక్చర్ వ్యాపారమే జీవనాధారం



30 ఏళ్లుగా నా భర్త షేక్ సలీం, నేను మురీ మిక్చర్ వ్యాపారం చేస్తున్నాం. దీనిపై వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఒక రోజు వ్యాపారం బాగుంటే.. మరో రోజు ఆదాయం అంతగా ఉండదు. వైఎంసీఏ ఎదురుగా మురీ మిక్చర్, పల్లీ మసాలా, చాట్ మసాలా, కార్న్ ఫ్లేక్ మిక్చర్, టమాటా స్లైసెస్ విక్రయిస్తున్నాం. ఆదివారం నాడు వ్యాపారం బాగా జరుగుతుంది. ఖర్చులు పోనూ రూ.500 వరకు మిగులుతుంది.
-షేక్ బీబీ, పీఎంపాలెం, మురీ మిక్చర్ వ్యాపారి

స్వీట్ కార్న్‌కు డిమాండ్



ఆర్.కె.బీచ్ రోడ్డులో మూడేళ్లుగా మొక్కజొన్న పొత్తుల వ్యాపారం చేస్తున్నాను. నా భర్త దుర్గాప్రసాద్ ఇక్కడే మురీ మిక్చర్ విక్రయిస్తున్నారు. బీచ్ చూడటానికి వచ్చే వారు స్వీట్ కార్న్ ఎక్కువగా తీసుకుంటారు. స్వీట్ కార్న్‌తోపాటు కార్న్ విక్రయిస్తున్నాను. సాధారణ రోజుల్లో రూ.500 వరకు ఆదాయం ఉంటుంది. శని, ఆదివారాల్లో రూ.1,500 నుంచి రూ.2,500 వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం మా వ్యాపారం అంతంత మాత్రంగానే ఉంది. ఇంటి ఖర్చులకే సరిపోతోంది.
-ఆర్.బుజ్జి, ఆరిలోవ, స్వీట్ కార్న్ వ్యాపారి

వేసవిలో వ్యాపారం బాగుంటుంది



ఆర్.కె. బీచ్ వద్ద 16 ఏళ్లుగా మురీ మిక్చర్, చాట్ మసాలా, మామిడి ముక్కల వ్యాపారం చేస్తున్నాను. నా కుటుంబం దీని మీదే ఆధారపడి ఉంది. ప్రస్తుతం వ్యాపారం బాగానే సాగుతోంది. రోజుకు రూ.500 వరకు మిగులుతుంది. వేసవిలో 3 నెలలు వ్యాపారానికి అనువుగా ఉంటుంది. దసరా పండగ వేళ బెంగాలీలు ఎక్కువగా వస్తారు. అప్పుడు వ్యాపారం చాలా బాగుంటుంది. వర్షాకాలంలో ఇబ్బందులు తప్పవు.
- పి.నాగేశ్వరరావు, వెంకటేశ్వర నగర్, మురీ మిక్చర్ వ్యాపారి

అన్ని రకాల బజ్జీలు విక్రయిస్తా..



ఆర్.కె. బీచ్ బస్‌స్టాప్ వద్ద 30 ఏళ్లకు పైగా మురీ మిక్చర్, బజ్జీల వ్యాపారం చేస్తున్నాను. వీటిని విక్రయించే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. మురీ మిక్చర్‌తోపాటు టమాటా, అరటి కాయ, మిరపకాయ, బ్రెడ్ బజ్జీలు, మామిడి కాయ ముక్కలు అమ్ముతున్నాను. రోజుకు రూ.800 నుంచి రూ.1000 ఆదాయం ఉంటుంది. వేసవిలో వ్యాపారం బాగుంటుంది. బీచ్‌రోడ్డులో అమ్మే బజ్జీలను పర్యాటకులు ఎక్కువగా ఇష్టపడి తింటారు.
- మజ్జి లక్ష్మణరావు, ఊటగెడ్డ

బీచ్ ఫుడ్ ముచ్చట్లు

వీఎంఆర్డీఏ పార్క్ నుంచి ఆర్కే బీచ్ కోస్టల్ **బ్యాటరీ వరకు** ఓ యూనియన్ ఆధ్వర్యంలో 500 **వరకు చిరు** వ్యాపారాలు నడుస్తున్నాయి. వాటిలో **250 వరకు** మురీ మిక్చర్ దుకాణాలు, స్వీట్, **మొక్కజొన్న** కండెల విక్రయ దుకాణాలు, **న్యూడిల్స్,** పానీపూరి షాపులు, ఐస్ క్రీం బళ్లు **ఉన్నాయి.** వీటితో పాటు నాన్ వెజ్ స్పైసీ వంటకా**లకు కొదవే** లేదు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 **నుంచి రాత్రి** 10 గంటల వరకు బీచ్‌రోడ్డులో **వ్యాపారాలు** జరుగుతాయి.

- **బీచ్‌రోడ్డు**లో విక్రయించే మురీ మిక్చర్‌కు ఫుల్ **డిమాండ్** ఉంటుంది. మురీ మిక్చర్ బండి **మీదే పీ**నట్ మసాలా, చాట్ మసాలా, కార్న్ **ఫ్లేక్ మి**క్చర్, బ్రెడ్ మిక్చర్, టమాటా స్లైసెస్, టమాటా బజ్జీ, అరటికాయ బజ్జీ, బ్రెడ్ బజ్జీ, మామిడి ముక్కలు విక్రయిస్తుంటారు.
- స్వీట్ కార్న్, కాల్చి ఇచ్చే హాట్ కార్న్‌లను ఇష్టంగా తినేవారి సంఖ్య ఎక్కువే. న్యూడిల్స్, పానీపూరి, ఐస్ క్రీమ్‌లకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. వీకెండ్, సెలవులు, పండగలు వస్తే ఈ దుకాణాలన్నీ నగరవాసులు, సందర్శకులతో కళకళలాడుతుంటాయి.
- చిరు వ్యాపారులకు రోజుకు పెట్టుబడి ఖర్చులు పోనూ రూ.500 నుంచి రూ.1000 వరకు మిగులుతుంది. ఆదివారం, పండగలు, సెలవు రోజుల్లో రూ.2,000 వరకు ఆదాయం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.
- ఇక్కడ వ్యాపారమంతా ఓ యూనియన్ ఆధ్వర్యంలో నడుస్తుండటం వల్ల ఎక్కడ కొనుగోలు చేసిన ధరలన్నీ ఒకేలా ఉంటాయి. రుచులు మాత్రం డిఫరెంట్‌గా ఉంటాయి. వేసవి కాలంలో ఫుల్‌గా బిజినెస్ ఉంటుంది.

స్వీట్ కార్న్ చాలా ఇష్టం



నాకు స్వీట్ కార్న్ అంటే చాలా ఇష్టం. టేస్ట్ డిఫరెంట్‌గా ఉంటుంది. ఆర్.కె. బీచ్‌కు వస్తే కచ్చితంగా స్వీట్ కార్న్ తీసుకుంటా. మురి మిక్చర్ కూడా ఇష్టంగా తింటాను. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో సరదాగా బీచ్‌కు వచ్చిన ప్రతీ సారి వీటిని తినకుండా వెళ్లను.
- పల్లా బబిత, లాసన్స్ బే కాలనీ, ఉద్యోగి

మురీ మిక్చర్ ఇష్టంగా తింటా..



ఆర్.కె. బీచ్‌కు ఎప్పుడొచ్చినా మురి మిక్చర్ కొంటాను. బీచ్ గట్టు మీద కూర్చొని మురీ మిక్చర్‌ను తింటూ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తాను. దీని రుచి స్పైసీగా భలే ఉంటుంది. అందుకే అనుకుంటా బీచ్ రోడ్డులో చాలా మంది మురీ మిక్చర్ తింటూ కనిపిస్తుంటారు.
-ఎం.స్వర్ణలత, మారికవలస, జూనియర్ లెక్చరర్

పీనట్ మసాలా తింటూ బీచ్‌ను ఆస్వాదిస్తా..



పార్వతీపురం మన్యం జిల్లా నాది. ఇక్కడ ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. సెలవు రోజుల్లో ఆర్కే బీచ్‌కు వచ్చి ఎక్కువ సమయం గడుపుతాను. పీనట్ మసాలా, చాట్ మసాలా తింటూ సాగర తీరాన్ని ఆస్వాదిస్తాను. పచ్చి బఠానీ, పల్లీలతో తయారు చేసే ఐటమ్స్ తినడానికి చాలా బాగుంటాయి. నా స్నేహితులకు మురీ మిక్చర్ మిర్చి, టమాటా బజ్జీలంటే ఇష్టం.
- పి.దుర్గాప్రసాద్, ప్రైవేట్ ఉద్యోగి

సాయి హర్షిణికి 'విట్'లో ఉచిత ప్రవేశం


సాయి హర్షిణి

అగనంపూడి : పేదింటి ఆణిముత్యానికి ప్రసిద్ధి చెందిన వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్)లో ఉచితంగా బీటెక్ చదువుకునే అవకాశం దక్కింది. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్లో 972 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన దేవరకొండ సాయి హర్షిణికి విజయవాడ విట్ బ్రాంచ్‌లో ఉచిత హాస్టల్, భోజన వసతితో ఈ సీటును కేటాయించారు. జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలిచిన సాయి హర్షిణి రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆణిముత్యాలు నగదు పారితోషికాన్ని కూడా పొందింది. ఏపీఈఏపీసెట్‌లో 13 వేల ర్యాంక్ సాధించింది. విట్‌లో సాయిహర్షిణికి ఉచిత సీటు దక్కడంపై ఇంటర్ బోర్డు ఆర్ఐవో సత్యనారాయణ, అగనంపూడి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్ అభినందించారు. సాయిహర్షిణి 'సాక్షి' తో మాట్లాడుతూ విట్‌లో సీటు రావడం ఆనందంగా ఉందన్నారు. తల్లిదండ్రులు సత్య ఆది లక్ష్మి, శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొంది.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: కటక్-కందర్పూర్ మధ్య నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు కారణంగా.. ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈనెల 14న టాటానగర్-విశాఖపట్నం(20815) ఎక్స్‌ప్రెస్ వయా కిషన్‌గంజ్, సాలాగావ్, నారాజ్ మార్థపూర్, బారగడ్ రోడ్‌ల మీదుగా నడుస్తుంది. కిషన్‌గంజ్, నారాజ్ మార్థాపూర్‌లలో తాత్కాలిక హాల్ట్ కల్పించారు. శుక్రవారం అగర్తలా-సికింద్రాబాద్(07029) ఎక్స్‌ప్రెస్ వయా కిషన్‌గంజ్, సాలాగావ్, నారాజ్ మార్థపూర్, బారగడ్ రోడ్‌ల మీదుగా నడుస్తుంది.
హైదరాబాద్-బ్రహ్మపూర్ స్పెషల్ : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్-బ్రహ్మపూర్ మధ్య సింగిల్ ట్రిప్ స్పెషల్ రైలు నడపనున్నారు. హైదరాబాద్-బ్రహ్మపూర్(07447) స్పెషల్ శుక్రవారం రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.28 గంటలకు దువ్వాడ, అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో(07448) 12న మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 8.03 గంటలకు దువ్వాడకు, మరుసటి రోజు ఉదయం 9.20 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

పారా బ్యాడ్మింటన్ పోటీల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఆహ్వాన పత్రికను ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం విడుదల చేశారు. రైల్వే స్టేడియం ఇండోర్ ఎన్‌క్లేవ్‌లో ఈ నెల 15వ తేదీ నుంచి ఈ పోటీలు జరగనున్నాయి. పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనుండగా.. ప్రతిభ చూపిన పారా క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారు.

ఫోన్ ఇవ్వలేదని బాలిక ఆత్మహత్యాయత్నం

కొమ్మాది: తల్లి సెల్ ఫోన్ ఇవ్వలేదని ఓ బాలిక ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన బీచ్‌రోడ్డులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం జంక్షన్ నరసింహనగర్ ప్రాంతానికి చెందిన మహిళకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్నేళ్ల కిందట ఆమె భర్త చనిపోవడంతో మంగమారిపేటలోని ఓ టీ దుకాణంలో పనిచేస్తూ.. తన కుమారుడిని వేరొక చోట పనికి పంపిస్తూ జీవనం సాగిస్తోంది. ఆమె కుమార్తె(13) మంగమారిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. రోజూ మాదిరిగా అందరూ ఇంటికి చేరుకున్న తర్వాత.. సెల్‌ఫోన్ ఇవ్వమని బాలిక తల్లిని అడిగింది. సెల్‌ఫోన్ వద్దు.. చదువుకోమని చెప్పడంతో బాలిక మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఇది గమనించిన తల్లి వెంటనే కుమార్తెను దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకెళ్లింది. ప్రస్తుతం బాలిక చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పోలీసుల అరెస్ట్

సింహాచలం: పోలీసులమని చెప్పి ఒకరి నుంచి నగదు దోచుకున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పెందుర్తి ఇన్‌చార్జి సీఐ ఈదుల నరసింహారావు తెలిపిన వివరాలివీ.. ఈ నెల 8న ఎస్. రాధాకృష్ణ అనే వ్యక్తి తన స్నేహితురాలితో కలిసి బైక్‌పై అడవివరం నుంచి భైరవవాక వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో బైకు ఆపి మాట్లాడుకుంటుండగా ఆర్మీ టోపీ, ఖాకీ దుస్తులు ధరించిన ఇద్దరు వ్యక్తులు వారిని పోలీసులమని బెదిరించారు. రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రాధాకృష్ణ ఫోన్‌పే ద్వారా వారికి రూ.16,400 చెల్లించాడు. అనంతరం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ అసిరితాత ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి.. ఎస్.కోట మండలం ధర్మవరానికి చెందిన ఈతలపాక శివప్రసాద్, ఎస్.కోట దరి ఎరుకుల కాలనీకి చెందిన పట్టాసి అశోక్‌లను నిందితులుగా గుర్తించారు. గురువారం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కాగా..శివప్రసాద్‌పై గతంలో 16 కేసులు నమోదై ఉన్నాయి. వీరిద్దరూ ఇంకా ఎవరినైనా బెదిరించి నగదు వసూలు చేసి ఉంటే.. 94906 07979కు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు.

డీసీసీబీ భవన నిర్మాణ స్థలం పరిశీలన

మహారాణిపేట: పాత నగరం(టౌన్ కొత్త రోడ్)లో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) భవన నిర్మాణం కోసం చదును చేసిన స్థలాన్ని గురువారం చైర్మన్ కోలా గురువులు పరిశీలించారు. ఇక్కడి డీసీసీబీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తొలగించారు. దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ స్థలాన్ని కోలా గురువులు పరిశీలించారు. డీసీసీబీ సీఈవో వర్మ భవన ప్లాన్‌ను చైర్మన్‌కు వివరించారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

గోపాలపట్నం: ప్రేమ వ్యవహారంలో మనస్పర్థల కారణంగా మనస్తాపానికి గురైన బాలిక బలవన్మరణానికి పాల్పడింది. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం నాగేంద్రకాలనీలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. కొత్తపాలెం నాగేంద్రకాలనీకి చెందిన బాలిక(17) నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. కళాశాలలో ఓ యువకుడితో ప్రేమలో పడింది. ప్రేమ వ్యవహారం సాగుతుండగా.. ఆమె మరికొంత మందితో సన్నిహితంగా ఉండడంతో ప్రియుడితో మనస్పర్థలు వచ్చాయి. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. గురువారం ఇంట్లోని గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చాలా సమయం వరకు గది తలుపులు తీయకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. వెంటనే గది తలుపులను బలవంతంగా తీశారు. ఆత్మహత్య చేసుకున్న ఆమెను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలు రాసిన ఓ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రియుడిని ఉద్దేశిస్తూ.. 'ఎవర్నీ వదలకు. మన మధ్య చిచ్చు పెట్టిన కొడుకులు కుక్క చావు చావాలంటూ' లేఖలో పేర్కొన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆమెకు తల్లి, తండ్రి, సోదరి ఉన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.